మౌనశంఖం

శ్రీరంగం నారాయణబాబు "రుధిరజ్యోతి" సంకలనం నుంచి.

సంకలనం ఆరుద్ర
నవోదయ పబ్లిషర్స్, ప్రథమ ముద్రణ, 1972.

[ నారాయణ బాబూ!
నీ మౌనశంఖం
(శ్రీశ్రీ చదవగా)
విని
నీ పాదాభివందనం చేసి
నీ గుండెల్లో నా తలదాచి
నీ మాటల్లో నా వ్యథ డించి
నా ఆత్మ పక్కన నీ ఆత్మ కలిపి
నీ నా పతంగి తాళ్ళు తెంపి
రూపాయలు మీద జల్లి
పోదామనుకున్నాను
వేళకు లేకపోయావు;
నుంగంబాకంలో ఆమెపక్కలోనో
అరవ ఆర్భాటం ఎదురుగుండానో
పందికొక్కు డొక్కలోనో
నీ అంతరాత్మ ఆలకించే ఉంటుంది.

- రుక్మిణీనాథ ]

కాడ్‌లీవరాయిల్లో 'డీ' విటమినుంటుంది
కోడిగుడ్లు ధాతుపుష్టి
కాకాతువ్వ తెలుపు; కోయిల నలుపు.

ఆకాశం పొడవు; భూమి వెడల్పు
ఆకాశం ప్రవళాధరం
అందుకొస్తే కదా!

నే పడుకొంటే
శరీరమంతా మెలికలు మెలికలై
'ఎవరు నీవు ' అని అడుగుతుంది

భూమంతా
మరకత పసిరికమై నా కాలు గోకి
'నీ వెవరు?' అని అడుగుతుంది

గాలి భుజం తట్టి నీవెవరంటుంది
పొద్దున్న, సాయంత్రం.

ఆకాశం పలక మీద
ప్రకృతే వేస్తుంది
బ్రహ్మాండమైన
రెండు ప్రశ్నార్థకపు గుర్తులు
నీవెవరు? నేనెవరని.
? ?

నీలగిరిలో పురుడు పోసుకొని
దాహం దాహం అంటూ మరణించిన
చూలాలి వక్షంలో గడ్డకట్టిన
చనుబాల జిడ్డును.

తాగి చనిపోయిన ఒక పుండాకోరుని
డాక్టరు శవపరీక్ష చేసినప్పుడు

అతని కడుపులో అరగకుండా
పైకి ఒలికిన సారా చుక్కను!

చూలాలై మృతశిశువుని కని
గుండెల్లో పాలే
పాముకాటులా బాధపెడితే,
ఒక యిల్లాలు
ఒక చీకటి రాత్రిలో వీధికాలువలో
కురిపించిన పాలవానను!

ఇంతకూ ఎవరైతేనేం?
రుక్మిణీకళ్యాణ తపస్సులో
కుటుంబచింతనలో కలిశాం

నీవూ నేనూ
కత్తిపీట మీద కలిసిన
అరటిపండు, అరిసె లాగ
ఎన్నిమార్లు నీవు లెక్కపెట్టినా
నన్ను మరచినా నీవు
ఉన్నవాళ్ళం ఇద్దరం!
నీటికన్న రక్తం చిక్కన
కవులమైనా అన్నదమ్ములమైనా
గర్భశత్రువులమైనా
శ్రీశ్రీ నేనూ

సిరాబుడ్డిలో కలం ముంచితే
సిరాకు బదులు పాళీకి తగిలింది
ఒక సాలెపట్టు
దానిమధ్యన చచ్చిన సాలెపురుగు

పట్టులో సజీవంగా వున్న
రెండు మక్షికాలు సాక్షాత్కరిస్తే
పక్కనున్న శ్రీశ్రీని పిలిచి
'ఏమిట్రా తంబీ?' అన్నా
'సాలెపట్టు లేదు. అదంతా కవితావ్యూహం
మక్షికాలు నీవూ నేనూ
పట్టులో చిక్కి చచ్చాం కామని
ఆకాశం చూరునుంచి సిరాబుడ్డిలో పడి
ఆత్మహత్య చేసుకున్న కృశాస్త్రి
రెక్కలు తెగాయి కాబట్టి
డేకురుకుంటు పోదాం పద వీధిలోకి!'

వ్రాత అయిపోయింది
సిరా మిగిలిపోయింది
ఏం సాధనమన్నా
'ఉంచు; నా మహాప్రస్థానం లోకి
వచ్చే మహారాజులకి
నీలి శాలువలల్లి కానుకలిస్తా
కాకపోతే
నీ నెత్తురు నల్లబడే దాకా నీవే త్రాగీ!
అప్పుడు వెలిగించు దీపం
ఈ మానవజాతికి నీవు ఎర్రదీపానివి
ప్లేగు వ్యాధికి కనిష్టీపువి'

అంత రోడ్డు ఆవలిస్తే
ముగ్గురు ఆడపిల్లలు పుట్టారు
తుమ్మితే
మూడు ఎలక్ట్రిక్ దీపాలు వెలిగాయి
లోపలికి ఒక దీర్ఘ నిశ్వాసం తీస్తే

అన్నీ మాయమయాయి
కాశ్మీరసరస్సులో పడవల్లాగు
కాలప్రవాహంలో కలరా శవాలు కొన్ని

'వీధులు ప్రమాదం, పరిగెడదాం పద
ఆ బయలు లోకి ' అన్నాడు
పరిగెట్టేం ఇద్దరం
అక్కడ గాలిలేదు వెలుతురు లేదు
శూన్యం లేదు
సప్తసముద్రాలు జట్టుకట్టుకొని
జలతరంగిణి వాయిస్తున్నాయి
ఆకాశం చిరిగిపోయిన అరటిదొప్పలా
ఒక మూల పడివుంది
భూగోళ పఠం మీద
ఉల్లిపొర కాగితం లాగ
మృతించిన శేషుడు
భూమిని చుట్టుకొని ఉన్నాడు
వెలిసిన రంగు గుడ్డలు మంచీచెడ్డా
జండాలై ఎగురుతున్నాయి!

కులపర్వతాలు
గాలిలో విమానాల్లా
ఎగురుతున్నాయి
కుష్టురోగంతో కాళ్ళూ చేతులూ పడిపోతే
కిందపడి దొర్లుతూ ఏడుస్తున్న దేవేంద్రుడు
ఇంకిపోయిన అమృతభాండంలో
తడైనా తగుల్తుందేమోనని
వేళ్ళతో స్పృశిస్తున్న శచీదేవి
దేవేంద్రుని సింహాసనం మీద

కూర్చుని వజ్రాయుధం
తానొకప్పుడు కొండలను ఖండించిన
రెక్కలన్నింటిని పోగుచేసి
మరల పర్వత భుజాలకు
అంటిస్తున్నాది పేస్టుతో

గండభేరుండ పక్షులు కలరవాలు చేస్తుంటే
శ్రీశ్రీ పాడుదామన్నాడు
అటు పక్కనుంచి
మాసినబట్టల మాటల మూటలు
రేవులో తగులబెట్టుకొని ఏడుస్తూ
ఎదురుగుండా తోచిన
చాకలి సరస్వతిని చూసి
కోపంతో శ్రీశ్రీ తన్నేందుకు కాలు ఎత్తి
మూగమై నిల్చున్నాడు

'అయితేనేం పోతేనేం' అన్నా
'ఎంతో సరదాపడి
పరీబజారులో కొన్న పా (తు (
జర్మను సాహిత్య కోమటిని
ప్రాధేయపడి తెచ్చిన వాల్‌ఖలేజ్
గురజాడ ప్రసాదించిన ముత్యాల సరం
హాప్కిన్సును అర్ధించి తెచ్చిన స్ప్రింగు రిదిమ్
అన్నీ పోయాయన్నాడు' నత్తిగ
ఇక పాట ఎలాగు?
పక్కను పడి వున్న శేషునికోర పెరికి
ఆడ గండభేరుండ పక్షి రెక్క మీద
డాలీ శ్రీశ్రీ రచించిన చిత్రపటానికి
మా శ్రీనారాయణ బాబు తీసిన చాయాచిత్రం!

పతం!
రెండు అస్థిపంజరాలు
అస్థిపంజరాలకు
అందం లింగభేదం అనవసరం
అయినా ఒకటి స్త్రీ అస్థిపంజరం
రెండవది మగవానిది.
స్త్రీ అస్థిపంజరం చేతిలో ఒక గులాబి అత్తరపుబుడ్డి
మెడలో మెరిసిపోతున్న కోహినూరు వజ్రం!
పక్కను నిలబడిన మొగ అస్థిపంజరం ఏడుస్తూ
నల్లబడిన ఎముకలతో వేడెక్కిన ఎముకలతో
చేతిలో
వజ్రవైఢూర్యాలు పొదివిన
బంగారపు గునపంతో
తాజమహల్ తవ్వేస్తూ!

ఇంతలో ఒక ఆడగండభేరుండపక్షి
దగ్గరకు వచ్చి
శ్రీశ్రీని ముక్కుతో అంకించుకొ
విమానంలా లేచిపోతూవుంటే
నేను ఎక్కడికన్నా
మాటలురాని మూగశ్రీశ్రీ
ఒక హస్తవిన్యాసం పట్టి
గరుడలోకానికని చూపించాడు
నాలో మాటలమరుపు ప్రారంభించింది
మరచిపోకుండా
మననం చేసుకుంటున్నా.

ఇంతలో

తొలినిశనుండి నేటి వరకు
మానవజాతి కన్న కలల సిమెంటుతో
కట్టిన గోడల తాకి
కాలప్రవాహం ఘూర్ణిస్తున్నాది
కొంతసేపు కాలాంతం లోకి
కాళ్ళు చాపుకొని కూచున్నా
ఎల్లలు కలిసిపోతున్నాయి
దిక్భిత్తికల పెల్లలు రాలిపోతున్నాయి
లేచా!
రజతాచలం కనబడితే
ఎక్కా!

కొండలోయలో పూలతోట
చెట్లు లేవు! అన్నీ పూవులే
ఉపనిషత్తులు తుమ్మెదలై
ఝుంకారం చేస్తున్నాయి
పార్వతి నగ్నంగా నిలబడి
పూలు కోస్తున్నాది.
ఈశ్వరుడు నిద్రపోతున్నాడు
పార్వతీ దర్శనమయ్యేసరికి
నా బట్ట అంటుకున్నాది
నే కాలిపోతున్నాను
మూగనై నిలుచున్నా
దగ్గరగా ఒక మౌనశంఖం తోచింది
మౌనశంఖం స్పృశించా!
నా గుండె అంతా హంసమై
సోహం అని అరిచింది!

నా చైతన్యమంతా

సప్తసముద్రాల సహస్రకోటి బాహువుల
మెరిసే నురగై ఛుయ్యిమంది
నా ఎముకల మూలుగులో
చంద్రోదయమైంది.
నా శరీరం
కాశ్యప భస్మరాశియై తరళించింది
నా ప్రాణం భగీరథుడైంది –
నా వెన్నెముక మీద
ఆకాశగంగా జలపాతం వర్షించింది
నా పొత్తికడుపు
హిమాచల తనయ
తన చల్లని మంచు హస్తాలతో నిమిరింది
రవం నీరవానికి Dimunitive !!!
oooooooooooooooooooo